సాక్షి
సూర్యాపేట
ఆదివారం ၊ 26 ၊ నవంబర్ ၊ 2023



కేంద్ర మంత్రి వాహనం తనిఖీ
తిరుమలగిరిలోని ఈదులపర్రె తండా వద్ద కేంద్ర మంత్రి వాహనాన్ని ఎన్నికల ప్రత్యేక బృందాలు తనిఖీ చేశాయి. - 6లో



అమిత్‌షా రోడ్ షో ఇలా..
చౌటుప్పల్ పట్టణంలో శనివారం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా రోడ్ షో నిర్వహించారు. - 6లో



పెళ్లి బృందం బస్సు బోల్తా
చింతపల్లిలో పెళ్లి బృందం బస్సు బోల్తాపడిన ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందగా పలువురికి గాయాలయ్యాయి. - 6లో

న్యూస్‌రీల్

పోస్టల్ బ్యాలెట్ ద్వారా 963 ఓట్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలో 963 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. దివ్యాంగులు, 80 సంవత్సరాల పైబడిన వారు, అత్యవసర సేవలు అందించే 13 శాఖల అధికారులు, ఉద్యోగులకు ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించింది. ఈ తరహాలో ఓటింగ్‌కు 12 డీ ఫారం ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో అర్హులైన వారు 1,008 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరు ఓటు వేసేందుకు ఈ నెల 23 నుంచి 25 వరకు అవకాశం కల్పించారు. జిల్లాలో 963 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. కాగా.. ఇంటి వద్ద ఓటు వేసే ప్రక్రియను వీడియో రికార్డు చేశారు. ఆ ఓట్లను భద్రపరిచి ఓట్ల లెక్కింపు రోజున మొదట లెక్కిస్తారు.

ప్రతిఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలి



పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసి సిరా చూపుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం: ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. జిల్లా కేంద్రంలో గల శ్రీవేంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రంలో శనివారం ఎస్పీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కుకు చాలా ప్రాధాన్యం ఉందన్నారు. పౌరులు ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

27న మహిళా కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక

సూర్యాపేటటౌన్: నిజామాబాద్ జిల్లాలో డిసెంబర్ 4వ తేదీ నుంచి 6 వరకు జరిగే 70వ సీనియర్స్ రాష్ట్ర మహిళా కబడ్డీ పోటీలకు జిల్లా మహిళా జట్టును ఈ నెల 27న ఎంపిక చేయనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామచందర్‌గౌడ్, కార్యదర్శి నామ నర్సింహారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10గంటలకు సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎంపిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు 75కేజీల లోపు బరువు, ఆధార్ కార్డు ఉండాలన్నారు. వివరాలకు 99123 81165 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రాజ్యాంగం భారతీయుల ఆది గ్రంథం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాం కుమార్

హుజూర్‌నగర్: రాజ్యాంగం భారతీయుల ఆది గ్రంథమని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం హుజూర్‌నగర్ పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లితే న్యాయస్థానాలను ఆశ్రయించి తగిన న్యాయం పొందవచ్చన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు న్యాయ వాదులు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం న్యాయమూర్తి న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, విద్యార్థినులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, కుక్కడపు బాలకృష్ణ, ఏజీపీ ఉప్పల గోపాలకృష్ణమూర్తి, ఎంఎస్ రాఘవరావు, లతీఫ్, వెంకటేష్, వీరయ్య, శంకర్, నాగూర్ పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

వలస ఓటర్లే నిర్ణేతలు!

ఎనిమిది నియోజకవర్గాల్లో వారి ప్రభావం

- ఉమ్మడి జిల్లాలో 1.70 లక్షల మందికి పైగా వలస ఓటర్లు
- స్వస్థలాల్లో ఓటేసేందుకు రప్పిస్తున్న నాయకులు
- కొన్నిచోట్ల రవాణా సదుపాయం కల్పించేలా ఏర్పాట్లు
- మరికొన్ని చోట్ల రాను పోను ఖర్చులు, ఓటుకు ఇంత ఇస్తామంటూ బేరసారాలు
- హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉంటున్న వారితో ప్రత్యేక సమావేశాలు

జంగ్ తెలంగాణ



ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాల వారీగా మొత్తం ఓటర్లు, వలస ఓటర్లు (అంచనా)

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	వలస ఓటర్లు
నల్లగొండ	2,44,560	9,500
నకిరేకల్	2,50,547	15,000
మునుగోడు	2,52,648	25,000
దేవరకొండ	2,51,622	20,000
నాగార్జునసాగర్	2,33,412	12,000
మిర్యాలగూడ	2,31,391	2,000
సూర్యాపేట	2,41,799	14,000
తుంగతుర్తి	2,55,017	25,000
హుజూర్‌నగర్	2,42,711	6,000
కోదాడ	2,41,554	6,400
ఆలేరు	2,33,266	30,000
భువనగిరి	2,16,941	6,000

2018 అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడలో బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్య యాదవ్‌కు 89,115 ఓట్లు లభించగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎన్.పద్మావతిరెడ్డికి 88,359 ఓట్లు వచ్చాయి. కేవలం 756 ఓట్ల తేడాతో ఆమె ఓడిపోయారు. తుంగతుర్తిలోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్ కుమార్‌కు 90857 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి అద్దంకి దయాకర్‌కు 89,010 ఓట్లు లభించాయి. తేడా 1847 ఓట్లు మాత్రమే. అభ్యర్థుల గెలుపోటములకు మధ్య తేడా ఒక్క ఓటు చాలు. ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమే. అందుకే ప్రతి ఓటు పొందేలా పార్టీలు ప్రణాళికతో పనిచేస్తున్నాయి. ఇందులో భాగంగా వలస ఓటర్లపైనా ప్రత్యేక దృష్టి సారించాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలు వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డాయి. – సాక్షి ప్రతినిధి, నల్లగొండ

ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాలకు గాను 8 నియోజకవర్గాల్లో వలస ఓటర్లే అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నల్లగొండ, నకిరేకల్, మునుగోడు, దేవరకొండ, నాగార్జునసాగర్, సూర్యాపేట, తుంగతుర్తి, ఆలేరు నియోజకవర్గాల్లో భారీ సంఖ్యలో వలస ఓటర్లు ఉన్నారు. ఇక మిగతా నియోజకవర్గాల్లోనూ వలస ఓటర్ల సంఖ్య అధికంగానే ఉంది. ఈ నేపథ్యంలో ఈసారి పార్టీలు వారిపై ప్రత్యేక దృష్టి సారించాయి. వారిని ప్రసన్నం చేసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఆకట్టుకునేందుకు తాయిలాల ఆశ

వలస ఓటర్లను ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీలు తాయిలాలను ఆశగా చూపుతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు వలస ఓటర్లు ఎక్కడెక్కడున్నారో తెలుసుకొని మరీ, వారితో సంప్రదింపులు జరుపుతున్నారు. నియోజకవర్గానికి చెందిన ఓటర్లు కొందరు ఉద్యోగ రీత్యా, మరికొందరు పిల్లల చదువుల కోసం, ఇంకొందరు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం, పేద కుటుంబాలకు చెందిన అనేక మంది కూలి పనులకోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి నివసిస్తున్నారు. వారి ఓట్లు మాత్రం స్థానికంగానే ఉన్నాయి. దీంతో వారిని పోలింగ్ రోజున రప్పించే ఏర్పాట్లలో పార్టీల నేతలు నిమగ్నమయ్యారు. వలస వెళ్లిన ఓటర్ల బంధువుల ఇళ్లకు వెళ్లి వారి ఫోన్ నంబర్లు, అడ్రస్‌లు తీసుకుని వారితో మాట్లాడుతున్నారు. చుట్టు పక్కల ఇంటి వారి నుంచి కూడా వలస ఓటర్ల సమాచారం తీసుకుని మాట్లాడుతున్నారు. పట్టణాల్లోని వార్డు ఇన్‌చార్జ్‌లు, మండల, గ్రామ ఇన్‌చార్జ్‌లు, పార్టీల నేతలు వలస ఓటర్లతో సంప్రదింపులు జరుపడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్ పరిసరాల్లో ఉంటున్న వారికి కారు వంటి వాహన సదుపాయం కల్పిస్తామని, ముంబై, చెన్నై, సూరత్, భీవండి, ఇతర రాష్ట్రాలు, దూర ప్రాంతాల్లో ఉంటున్న వారికి రానుపోనూ రవాణా ఖర్చులు, గిఫ్టులు ఇవ్వడంతోపాటు ఓటుకు ఇంత ఇస్తామంటూ వల వేస్తున్నారు.

ప్రత్యేక సమావేశాలపై దృష్టి

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య ప్రధాన పోటీ ఉండటం, కొన్ని నియోజకవర్గాల్లో బీజేపీ కూడా పట్టుకోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో గెలుపోటముల్లో వలస ఓటర్లు కీలకంగా మారే అవకాశం ఉంది. అందుకే అన్ని పార్టీల అభ్యర్థులు వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డాయి. హైదరాబాద్ పరిసరాల్లో పెద్దఅంబర్‌పేట్, హయత్‌నగర్, కుంట్లూరు, బీఎన్‌రెడ్డి నగర్, వనస్థలిపురం ఎల్బీనగర్, ఉప్పల్, బోడుప్పల్, నారపల్లి, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్ తదితర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టిన రాజకీయ పార్టీలు వారిని ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నాయి. వారితో ప్రత్యేక సమావేశాలకు తెరతీశాయి. ఇటీవల మునుగోడు నియోజకవర్గానికి చెందిన బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి హైదరాబాద్ వనస్థలిపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. మిగతా పార్టీల అభ్యర్థులు కూడా వలస ఓటర్లతో సమావేశాల నిర్వహణపై దృష్టి సారించారు.

interview



నలమాద పద్మావతిరెడ్డి

'అక్రమాలకు, అరాచకాలకు నిలయంగా మారిన కోదాడలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే నా ప్రధాన లక్ష్యం.. ప్రజలే మా కుటుంబం.. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటా.. ప్రస్తుత ఎమ్మెల్యేలా దోచుకోవడం మాకు తెలియదు.. కోదాడలో అక్రమ వ్యాపారాలను నిరోధిస్తా.. మట్టి పై మామూళ్లు లేకుండా, రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి కమీషన్‌లు లేకుండా, గంజాయి దందాకు చెక్‌పెట్టి యువతను కాపాడుకుంటా.. పార్టీలో చేరిన సీనియర్ నాయకుల సహకారంతో మంచి పాలన అందిస్తా' అని కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతిరెడ్డి తెలిపారు. శనివారం సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే.. - కోదాడ

ప్రజలే మా కుటుంబం

కోదాడలో ఐదేళ్లుగా అరాచకమే రాజ్యమేలుతోంది

ప్రశాంత వాతావరణం కల్పించడమే ధ్యేయం
ఆరు గ్యారంటీలతో అద్భుతాలు చేయబోతున్నాం
50వేల మెజార్టీతో గెలవబోతున్నా
వంద రోజుల్లో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం
కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతి రెడ్డి

కోదాడ నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా అన్ని వర్గాల ప్రజలు, నాయకులు కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారంటీలతో అద్భుతాలు సృష్టించబోతున్నాం. కోదాడలో 50 వేలకు పైగా మెజార్టీతో గెలవబోతున్నాం.

అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మరు

నేను అందుబాటులో ఉండనని అధికార పార్టీ అసత్య ప్రచారం చేస్తోంది. ఓడిపోతున్నామనే భయంతోనే అధికారపార్టీ అలా అబద్ధపు ప్రచారం చేస్తోంది. 20 సంవత్సరాలుగా కోదాడ ఆడబిడ్డగా ఇక్కడే ఉంటున్నా. ఇప్పుడు సొంత ఇల్లు కూడా నిర్మించుకున్నా. కోదాడ ప్రజలే మా కుటుంబం. అధికార పార్టీ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు.

యువతను కాపాడుకుంటా

ఐదు సంవత్సరాలుగా కోదాడలో అరాచకం రాజ్యమేలుతోంది. అక్రమాలకు అంతు లేకుండా పోయింది. ప్రజలు, వ్యాపారులు ప్రశాంతంగా ఉండలేక పోతున్నారు. కోదాడలో ప్రశాంత వాతావరణం నెలకొల్ప డంతో పాటు ప్రజలు ఎవరి పనులు వారు, వ్యాపారాలు స్వేచ్ఛగా చేసుకునే విధంగా చూస్తాను. కోదాడను గంజాయికి అడ్డాగా మార్చారు. దీన్ని కూకటి వేళ్లతో పెకిలించి కోదాడ బిడ్డలను, యువతను కాపాడుతాను. అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాను.

మూతబడిన లిఫ్టులకు మరమ్మతులు చేయిస్తా..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాబోతున్నది. ఉత్తమ్ మంచి పొజిషన్‌లో ఉండబోతున్నారు. వారి సహకారంతో కోదాడలో 100 రోజుల్లో వంద పడకల వైద్యశాల నిర్మాణం చేపడతా. కోదాడ ట్యాంక్‌బండ్ పనులు పూర్తి చేయిస్తా. పాలిటెక్నిక్ కళాశాలను తీ సుకొస్తా. మోతె మండలంలో సాగునీరు చివరి భూములకు అందిస్తా. మూతపడిన లిఫ్టులను మరమ్మత్తులు చేయిస్తాను. ఉత్తమ్ ఎత్తిపోతలను పునరుద్ధరిస్తాను. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తి చేయిస్తా.

అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరిగేలా చూస్తా

అవినీతి రహిత పాలన అందించడానికి కోదాడ నియోజకవర్గ ప్రజలంతా నాకు అండగా ఉండాలని కోరుతున్నా. నన్ను గెలిపిస్తే అక్రమ కేసులు ఉండవు. అధికారులకు పూర్తి స్వేచ్ఛనిస్తా. ఏకపక్ష నిర్ణయాలు ఉండవు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరిగేలా చూస్తా. ప్రభుత్వ పథకాలలో ఎలాంటి అవినీతి లేకుండా చూస్తా. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలను అర్హులందరికీ అందేలా చూస్తా.

ఆదరిస్తే అభివృద్ధి చేస్తాం



విజయ సంకల్ప సభలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వల్ల ఒరిగిందేమీలేదు
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

హుజూర్‌నగర్ : బీజేపీ, జనసేన అభ్యర్థులను ఆదరించి గెలిపిస్తే రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల వల్ల తెలంగాణకు ఒరిగిందేమీలేదని విమర్శించారు. హుజూర్‌నగర్ బీజేపీ అభ్యర్థి చల్లా శ్రీలతరెడ్డి, కోదాడ జనసేన అభ్యర్థి మేకల సతీష్‌రెడ్డిల గెలుపునకు మద్దతుగా శనివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సకల జనుల విజయ సంకల్ప సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అవినీతి పార్టీలంటూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు పరస్పరం ఆరోపణలు చేస్తుకుంటున్నారని పేర్కొన్నారు. 'రాష్ట్రంలో జాతీయ రహదారులను 200 కిలోమీటర్ల మేర పెంచాం.. వీటిలో ఒక జాతీయ రహదారి కోదాడ, హుజూర్‌నగర్ నుంచి వెళ్తోంది. ఈ విషయం మీకు తెలిసిందే' అని ఆయన గుర్తు చేశారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి చల్లా శ్రీలతరెడ్డి, కోదాడ నియోజకవర్గ జనసేన అభ్యర్థి మేకల సతీష్‌రెడ్డిలు మాట్లాడుతూ ఉత్తమ్, బొల్లం మల్లయ్యలను గెలిపించడం వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని అన్నారు. గతంలో టీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే మిషన్ భగీరథ పేరుతో రూ. 40 వేల కోట్ల ప్రాజెక్టు తెచ్చి గ్రామాలు, తండాల్లో రోడ్లు తవ్వి పైపులు వేశారు కానీ తాగునీటికి గతి లేదని గుంతలు మాత్రం మిగిలాయని ఎద్దేవా చేశారు. సభలో కేంద్ర ఐటీ కమ్యూనికేషన్ శాఖ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, కర్ణాటక ఎమ్మెల్సీ రవి కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిషోర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఈవీ రమేష్, నాయకులు అక్కిరాజు యశ్వంత్, అంబళ్ల నరేష్, ఓర్సు వేణుగిరాజు, బొలిశెట్టి కృష్ణయ్య, బాల వెంకటేశ్వర్లు, సురేష్, విజయ భాస్కర్‌రెడ్డి, రవి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

రెండు గంటలు ఆలస్యంగా..

వాతావరణం అనుకూలించకపోవడంతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హెలికాప్టర్‌లో రెండు గంటలు ఆలస్యంగా హుజూర్‌నగర్‌కు చేరుకున్నారు. ఆయనకు ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు హాజరయ్యారు. సభ ఆలస్యం కావడంతో ప్రజలు విసుగు చెందకుండా ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దాదాపు 300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సకల జనుల విజయ సంకల్ప సభకు హాజరైన ప్రజలు

ఆశ్రమ పాఠశాల తనిఖీ

చివ్వెంల : మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను గిరిజన సంక్షేమశాఖ అధికారి ఎం.సాంబశివరావు శనివారం రాత్రి తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న బోధన తీరును పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పుస్తకాలు, దుస్తులు, వస్తువుల పంపిణీని పరిశీలించారు. మౌలిక వసతులు, భోజనం మెనూ వివరాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు.

మొసలి కన్నీరుకు మోసపోవద్దు



సూర్యాపేటలో నిర్వహించిన రోడ్ షోకు హాజరైన ప్రజలు

- ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి
- సూర్యాపేట రోడ్ షోలో మంత్రి జగదీష్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి


సూర్యాపేట: ఎన్నికల వేళ మొసలి కన్నీరుకు మోసపోవద్దని, ఓటు వేసే సమయంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూర్యాపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి సూర్యాపేటలో ఆయన రోడ్ షో నిర్వహించారు. ఇందిరమ్మ కాలనీ, సీతారాంపురం, అఫ్జల్ రైస్ మిల్, హౌసింగ్ బోర్డ్, కృష్ణ టాకీస్, ముత్యాలమ్మ గుడి, చంద్రన్న కుంట, మామిళ్ల గడ్డ, తాళ్లగడ్డ నుంచి భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దామోదర్ రెడ్డి పాలనలో రహదారులు అధ్వానంగా ఉండేవని, నేడు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఓట్లు వేయాలని అడుగుతున్న వారికి ఏ కారణం చేత ఓట్లు వేయాలో ప్రజలు ఆలోచించాలన్నారు. నల్లచెరువు నక్లెస్ రోడ్, ఉర్లుగొండ లింగమంతుల స్వామి గుట్టలు, పిల్లలమర్రి, ఫణిగిరి, మూసి ప్రాజెక్టులను కలిపి సూర్యాపేటను పర్యాటక క్షేత్రంగా మారుస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య, మున్సిపల్ చైర్మన్ అన్నపూర్ణ, గండూరి ప్రకాశ్ తదితరులున్నారు.

కరువు, కాటకాలను రూపుమాపిన బీఆర్‌ఎస్

సూర్యాపేట రూరల్: కాంగ్రెస్ వదిలి వెళ్లిన కరువు కాటకాలను, ఆకలి దప్పికలను రూపుమాపిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట మండలంలోని కేటీ అన్నారం, పిన్నాయిపాలెం, సపావత్ తండా, యర్కారం, రామన్నగూడెం, బాలెంల గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సూర్యాపేటలో ఏం చేశారో, ఏం చేస్తారో చెప్పే దమ్ము కాంగ్రెస్ అభ్యర్థి దామోదర్ రెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో మోటార్ కాలని రైతే లేడన్నారు. మూసి గేట్లకు రంధ్రం పడి, నీరు వృథాగా పోయి, రైతులకు నష్టం వాటిల్లుతున్నా, పూడ్చివేయాలన్న సోయి కూడా ఆనాడు దామోదర్ రెడ్డికి లేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మూసి గేట్లకు మరమ్మతులు చేశామన్నారు. రైతుబిడ్డగా మరింత అభివృద్ధి చేసేందుకు మీ ఆశీర్వాదం అందించాలని కోరారు. ప్రచారంలో ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం, వైస్ ఎంపీపీ శ్రీనివాసనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు బైరెడ్డి అలివేలబీంరెడ్డి, లాలునాయక్, మోదుగునాగిరెడ్డి, చింతలపాటి మౌనిక మధు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సత్వరమే స్పందించాలి

- కలెక్టర్ వెంకట్రావ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులు ఆయా నియోజకవర్గాల్లో సమస్యలపై సత్వరమే స్పందించాలని కలెక్టర్ వెంకట్రావ్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో ఆర్‌ఓలతో పాటు నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులతో ఎన్నికల విధి విధానాలు, 28, 29 తేదీల్లో చేపట్టాల్సిన విధులపై ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకలతో కలసి అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ రోజున ప్రతి రెండు గంటలకు పోలింగ్ పర్సంటేజీను గూగుల్ షీట్‌లో పొందుపరచాలన్నారు. క్రిటికల్ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లను చేయనున్నట్లు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా రూట్స్‌లల్లో పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఆర్డీఓలు వీరబ్రహ్మాచారి, సూర్యనారాయణ, జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి చేయాలి

కౌంటింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ గోడౌన్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములను అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. లైటింగ్, బారికేడ్లు, మీడియా సెంటర్ అన్ని వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, ఏఓ సుదర్శన్‌రెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, అధికారులు ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ సెంటర్ పరిశీలన

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లను శనివారం కలెక్టర్ వెంకట్రావ్ అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకతో కలిసి పరిశీలించారు. ఫెసిలిటేషన్ సెంటర్లలో ఏర్పాట్ల గురించి ఆర్డీఓ వీరబ్రహ్మాచారిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, చివ్వెంల తహసీల్దార్ రంగారావు, ఎలక్షన్ సూపరిటెండెంట్ శ్రీనివాసరాజు ఉన్నారు.

మహిళల అభయ హస్తం పునరుద్ధరిస్తాం

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్

హుజూర్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళల అభయ హస్తం పింఛన్‌ను పునరుద్ధరిస్తామని హుజూర్‌నగర్ అభ్యర్థి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్లో ఏర్పాటుచేసిన నియోజకవర్గ మహిళల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన పొదుపు సంఘాలకు పూర్వ వైభవం రావాలంటే హస్తం గుర్తుకే ఓటువేయాలన్నారు. అధికారంలోకి రాగానే దాదాపు 64 లక్షల మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో కేతిరెడ్డి శకుంతల, పెండెం సుజాత, వల్లభనేని విజయలక్ష్మి, ఉస్తెల సృజన, గొట్టిముక్కుల నిర్మల, మల్లెల శ్రావణి, బచ్చలకూరి రజిత, తన్నీరు రాధిక, అనురాధ, చప్పిడి సావిత్రి, లక్ష్మి, శరణ్య, భూక్యా నీలా పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి జీవీఆర్

ఇటీవల వైఎస్సార్ తెలంగాణ పార్టీ నుంచి మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన మేళ్లచెరువుకు చెందిన ఎన్‌డీసీఎంఎస్ మాజీ చైర్మన్ జల్లేపల్లి వెంకటేశ్వర్లు (జీవీఆర్) కాంగ్రెస్‌లో చేరారు. శనివారం హుజూర్‌నగర్‌లో ఎంపీ ఉత్తమ్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

విజయ సంకల్ప సభ


హుజూర్‌నగర్‌లో నిర్వహించిన విజయ సంకల్ప సభలో అభివాదం చేస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, చిత్రంలో హుజూర్‌నగర్ బీజేపీ అభ్యర్థి చల్లా శ్రీలతారెడ్డి, కోదాడ జనసేన అభ్యర్థి మేకల సతీష్‌రెడ్డి


జేపీ నడ్డాకు నమస్కరిస్తున్న హుజూర్‌నగర్ బీజేపీ అభ్యర్థి చల్లా శ్రీలతారెడ్డి, చిత్రంలో కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్

● బీఆర్‌ఎస్ జోష్


బొమ్మలరామారం మండలం చీకటిమామిడిలో మంత్రి హరీశ్‌రావు కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు


చీకటిమామిడి కార్నర్ మీటింగ్‌లో గులాబీ కండువాలు ఊపుతున్న బూడిద భిక్షమయ్య తదితరులు


చీకటిమామిడి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

అమిత్‌షా రోడ్ షో కొనసాగిందిలా..


చౌటుప్పల్‌లో నిర్వహించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రోడ్ షో సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ కార్యకర్తలు


అభివాదం చేస్తున్న అమిత్ షా, చిత్రంలో మునుగోడు అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి, బూర నర్సయ్యగౌడ్, గంగిడి మనోహర్‌రెడ్డి

చౌటుప్పల్: మునుగోడు బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డికి మద్దతుగా చౌటుప్పల్ పట్టణంలో శనివారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రోడ్ షో నిర్వహించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లిలో గల ముస్కు మధుసూదన్‌రెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు మధ్యాహ్నం 2.20 గంటలకు అమిత్ షా చేరుకున్నారు. ఆయనకు భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, మునుగోడు బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి తదితర నాయకులు స్వాగతం పలికారు. అనంతరం అమిత్ షా ప్రచార రథం పైకి ఎక్కి రోడ్ షో ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలతో కలిసి తంగడపల్లి, తంగడపల్లి రోడ్డు, జాతీయ రహదారి, బస్టాండ్ జంక్షన్ నుంచి చిన్నకొండూర్ చౌరస్తా వరకు రోడ్‌షో కొనసాగింది. ప్రచార రథంపై నుంచి అమిత్‌షా అభివాదం చేస్తూ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. భారత్ మాతాకీ జై, జైశ్రీరాం అంటూ ఆయన స్వయంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనూరి వీరారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, బీజేపీ మండల, మున్సిపల్ అధ్యక్షులు రిక్కల సుధాకర్‌రెడ్డి, ఊడుగు వెంకటేశం, సర్పంచ్‌లు కాయితి రమేష్, బాతరాజు సత్యం, నాయకులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, మునగాల తిరుపతిరెడ్డి, ఆలె చిరంజీవి, శాగ చంద్రశేఖర్‌రెడ్డి, దాసోజు భిక్షమాచారి, పాలకూర్ల జంగయ్య, ఊడుగు యాదయ్య, రమనగోని దీపిక, కదారి కల్పన, కైరంకొండ అశోక్, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు భువనగిరికి సీతారాం ఏచూరి రాక

భువనగిరిటౌన్: భువనగిరి, మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల సీపీఎం అభ్యర్థుల తరఫున ప్రచారం చేసేందుకు గాను ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు భువనగిరిలో రోడ్ షో నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రోడ్ షోకు సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. రోడ్ షోకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అమిత్‌షా సభను జయప్రదం చేయాలి

సాక్షి యాదాద్రి: కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు బీజేపీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని భువనగిరి బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయగిరి వద్ద సభా ఏర్పాట్లను జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావుతో కలిసి ఆయన పరిశీలించారు. అధికారులు, పార్టీ నాయకులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ మధ్యాహ్నం 2గంటలకు సభ ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. ఈ సభకు 50 వేల మందిని తరలించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. తనతో పాటు ఆలేరు నియోజకవర్గ అభ్యర్థి పడాల శ్రీనివాస్ సభలో పాల్గొంటారని తెలిపారు. సభా వేదిక పక్కనే హెలిపాడ్ ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణాన్ని ఎస్‌పీజీ, కేంద్ర భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి.


సభ నిర్వహించే స్థలంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న గూడూరు నారాయణరెడ్డి తదితరులు

జంగ్ తెలంగాణ

పోస్టల్ బ్యాలెట్‌ను అడ్డుకున్న వారిపై కేసు

నడిగూడెం : పోస్టల్ బ్యాలెట్‌ను అడ్డుకున్న వారిపై శనివారం నడిగూడెం పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. నడిగూడెం మండల కేంద్రంలో ఈ నెల 23న పోస్టల్ బ్యాలెట్ ద్వారా పలువురు ఓటు వేస్తున్నప్పుడు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఈ నెల 24న తహసీల్దారు హేమామాలిని పోలీసులకు ఫిర్యాదు చేయగా శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపారు.

తాయిలాలకు అంగీకరించినా నేరమే..

భువనగిరి: ఎన్నికల సమయంలో పలువురు అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించేందుకు మద్యం, నగదు, క్రీడా సామగ్రి వంటివి ఇస్తూ ప్రలోభాలకు గురిచేస్తుంటారు. అభ్యర్థులు వీటిని పంచుతూ పట్టుబడితే కేసు నమోదు చేస్తారు. అయితే వాటిని తీసుకున్నా.. లేదా తీసుకోవడానికి అంగీకరించినా ప్రజా ప్రాతినిధ్య చట్టం–1951(సెక్షన్–123) ప్రకారం నేరమే అవుతుంది. తాయిలాలు తీసుకుంటూ దొరికితే జైలు శిక్ష లేదా జరిమానా లేదంటే రెండూ కలిపి విధించే అవకాశం ఉంది.

‘పోస్టల్’ ఓటేసిన అధికారులు

నల్లగొండ: పోలింగ్ విధుల్లో ఉన్న అధికారులు, ఇతర సిబ్బంది నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నియోజకవర్గాల వారీగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో శనివారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. కళాశాలలో శిక్షణకు హాజరైన ఓపీఓలు, పోలీస్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లలో కొందరు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమాన్ని తనిఖీ చేసేందుకు వచ్చిన కలెక్టర్ కర్ణన్ ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటేసేందుకు భారీ క్యూ ఉండడంతో కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇరిగేషన్ డీఈ చక్రపాణి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేశారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి రవి, శిక్షణ అధికారి వెంకయ్య, మ్యాన్ పవర్ నోడల్ అధికారి పార్వతీశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఓటు వేసిన ఇరిగేషన్ డీఈ చక్రపాణి

ఎన్నికల సిత్రాలు

● పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా..


చిలుకూరు: సైకిల్‌పై మొక్కలు పెట్టుకొని ప్రచారం చేస్తున్న పర్యావరణవేత్త, కోదాడ స్వతంత్ర అభ్యర్థి కొల్లు లక్ష్మీనారాయణ

● ఓటరు మనసు ‘దోసే’స్తా..


యాదగిరిగుట్ట: ప్రచారంలో భాగంగా యాదగిరిగుట్టలో దోశలు వేస్తున్న ఆలేరు కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల అయిలయ్య

అదుపుతప్పి పెళ్లి బృందం బస్సు బోల్తా

- పెళ్లి కుమారుడి నాయనమ్మ మృతి.. 16మందికి గాయాలు
- క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమం
- డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణం
- చింతపల్లి మండల కేంద్రంలో విషాదం


ప్రమాద స్థలం వద్ద రోదిస్తున్న క్షతగాత్రులు


గాయపడిన వారిని తరలిస్తున్న పోలీసులు


భారతమ్మ (ఫైల్)

చింతపల్లి : నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున పెళ్లి బృందం బస్సు అదుపుతప్పి బోల్తాకొట్టడంతో పెళ్లికుమారుడి నాయనమ్మ మృతిచెందగా మరో 16మందికి గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. హైదరాబాద్‌లోని హయత్‌నగర్ పరిధి కుంట్లూరుకు చెందిన హరీష్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన అనూషారెడ్డితో ఈ నెల 24న అక్కడే వివాహం జరిగింది. వేడుకలో పాల్గొనేందుకు హరీష్‌రెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు 40మంది శుక్రవారం హైదరాబాద్ నుంచి ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో వినుకొండకు బయల్దేరారు. అదేరోజు మధ్యాహ్నం వేడుక ముగిసిన తర్వాత పెళ్లి బృందం సభ్యులు సరదాగా గడిపారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత హైదరాబాద్‌కు బస్సులో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో చింతపల్లిలోని సాయిబాబా దేవాలయం సమీపంలోకి రాగానే డ్రైవర్ గఫూర్ నిద్రమత్తుతో బస్సు అదుపుతప్పింది. ఈ క్రమంలో బస్సు ఒక్కసారిగా రోడ్డుకు ఎడమవైపునకు దూసుకెళ్తున్న క్రమంలో పెళ్లి బృందం సభ్యులు కేకలు వేశారు. దీంతో డ్రైవర్ తేరుకుని బస్సును కుడివైపు తిప్పి రోడ్డు ఎక్కించే క్రమంలో వేగ నియంత్రణ లేక బోల్తా కొట్టింది. ప్రమాదంలో పెళ్లి కుమారుడి నాయనమ్మ సప్పిడి భారతమ్మ(64) అక్కడికక్కడే మృతిచెందగా బంధువులు వసంత, నరేందర్‌రెడ్డి, కతిక్‌రెడ్డి, సునంద, ప్రణవి, నిర్మల, శ్రేయారెడ్డి, పద్మ, శ్రీహిత, హర్షిత, శ్యామ్‌సుందర్‌రెడ్డి, చైతన్య, ప్రవీణ, నర్సింహారెడ్డిలకు స్వల్ప, లింగమ్మ, వెంకటనర్సింహారెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను స్థానికులు ప్రైవేట్ అంబులెన్స్, 108 వాహనాల్లో స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రోడ్డుకు అడ్డంగా బస్సు పడిపోవడంతో గంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు జేసీబీల సహాయంతో బస్సును పక్కకు తీయించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. తీవ్రంగా గాయపడిన లింగమ్మ, వెంకటనర్సింహారెడ్డిల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మృతురాలి కుమారుడు వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.

చౌటబావి గ్రామంలో విషాదం

నార్కట్‌పల్లి : చింతపల్లి మండల కేంద్రంలో పెళ్లి బృందం బస్సు అదుపుతప్పి బోల్తా కొట్టిన ప్రమాదంలో పెళ్లికుమారుడి నాయనమ్మ సప్పిడి భారతమ్మ (64) మృతిచెందడంతో ఆమె స్వగ్రామం నార్కట్‌పల్లి మండలం చౌటబావి గ్రామంలో విషాదం అలుముకుంది. చౌటబావి గ్రామానికి చెందిన సేనయ్యరెడ్డి, భారతమ్మ దంపతులకు ఇద్దరు కుమారుడు, కుమార్తె సంతానం. అందరికీ వివాహాలు జరిపించారు. పిల్లల కుటుంబాలు హైదరాబాద్‌లో స్థిరపడగా వృద్ధ దంపతులు స్వగ్రామంలోనే ఉంటూ అప్పుడప్పుడు హైదరాబాద్‌కు వెళ్లి వస్తుంటారు. గుంటూరు జిల్లా వినుకొండలో జరిగిన సేనయ్యరెడ్డి సోదరుడి మనువడు హరీష్‌రెడ్డి వివాహానికి వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదంలో భారతమ్మ మృతిచెందింది. ఆమె అంత్యక్రియలు హైదరాబాద్‌లోనే నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

ప్రజాకోర్టులో కాంగ్రెస్‌కు భంగపాటు తప్పదు

- ఈడీ, ఐటీ దాడులపై రేవంత్ బహిరంగ లేఖ హాస్యాస్పదం
- రైతు బంధుపై ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు హర్షణీయం
- సూర్యాపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి జగదీష్‌రెడ్డి


సూర్యాపేట మండలం కేటీ అన్నారంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట రూరల్ : ప్రజా కోర్టులో మరోసారి కాంగ్రెస్ పార్టీకి భంగపాటు తప్పదని సూర్యాపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట మండలం కేటీ అన్నారం గ్రామంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీజేపీలు కలిసి కుట్రపూరితంగా ఐటీ, ఈడీ దాడులు చేయిస్తున్నాయని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ రాయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గోబెల్స్ ప్రచారానికి సిద్ధహస్తుడైన రేవంత్‌కు బీఆర్‌ఎస్ నాయకులపై జరుగుతున్న ఐటీ ,ఈడీ దాడులు కనపడటం లేదా అని ప్రశ్నించారు. రేవంత్ అబద్ధాలు ఆడుతూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. బీఆర్‌ఎస్‌కు రోజురోజుకీ ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్నారు. కేసీఆర్ లేకుంటే చీకట్లే అనే నిజాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. దొరలు దేశ్‌ముఖ్‌లే కాంట్రాక్టర్ అవతారమెత్తి కాంగ్రెస్ రూపంలో వస్తున్నారన్నారు. జాతీయ పార్టీలకు సైతం పేదల సంక్షేమంపై సోయి లేదన్నారు. పేరుకు జాతీయ పార్టీలైనా ప్రాంతీయ పార్టీలకంటే హీనంగా తయారయ్యాయని మంత్రి మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా 24గంటల విద్యుత్ సరఫరా కావడం లేదని పేర్కొన్నారు. అన్ని పథకాలను అడ్డుకున్నట్టే ఎన్నికల కమిషన్‌ను అడ్డు పెట్టి రైతు బంధుని అడ్డుకునే కుట్ర పన్నారని ఆరోపించారు. కానీ, రైతు బంధు అమలు చేయాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు ఇవ్వడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌ను 12 సీట్లలో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఇండికా క్విజ్ పోటీల్లో ‘తేజ’ విద్యార్థుల ప్రతిభ

కోదాడరూరల్ : హైదరాబాద్‌లోని బీ.ఎం బిర్లా ఆడిటోరియంలో నెక్సాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండికా క్విజ్ పోటీల్లో కోదాడ పట్టణంలోని తేజ విద్యాలయ విద్యార్థులు విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ రమాదేవి శనివారం తెలిపారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు భారతదేశ చరిత్ర, సంస్కృతి, భౌగోళిక స్వరూపం, రాజకీయాలు, క్రీడలు, వాణిజ్యం వంటి అంశాలపై ఈ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 పాఠశాలలు పాల్గొన్న ఈ పోటీల్లో తేజ విద్యాలయకు చెందిన నోముల సృజన్‌గుప్త, దేవరపల్లి సునందువర్ధన్‌రెడ్డి 57 పాయింట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచారని తెలిపారు.

ధాన్యం విక్రయించి వెళ్తూ మృత్యుఒడికి

- రోడ్డు ప్రమాదంలో రైతుతో పాటు ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం
- ఉప్పలపహాడ్ వద్ద ట్రాక్టర్‌ను డీసీఎం ఢీకొట్టడంతో దుర్ఘటన
- మృతులిద్దరూ ఖమ్మం జిల్లా వాసులు



సోమ్లానాయక్, దీపక్‌కుమార్ మృతదేహాలు

కేతేపల్లి: ధాన్యం విక్రయించి వెళ్తున్న రైతుతో పాటు ట్రాక్టర్ డ్రైవర్‌ను డీసీఎం రూపంలో మృత్యువు కబళించింది. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల పరిధిలో జరిగిన ఈ దుర్ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా కూసుమంచి సమీపంలోని మంగళతండాకు చెందిన తెజావత్ సోమ్లానాయక్(57) వానాకాలం సీజన్‌లో పండించిన వరి ధాన్యం బస్తాలను అమ్మేందుకు ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని శుక్రవారం ఉదయం కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్‌కు వచ్చారు. గ్రామంలో గల చాముండేశ్వరి రైస్ మిల్లులో ధాన్యం విక్రయించిన అనంతరం శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంట సమయంలో ట్రాక్టర్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్ వద్ద అండర్‌పాస్ పైకి చేరుకోగానే సూర్యాపేట వైపు వెళ్తున్న అంబులెన్స్ వీరి ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. వారు తేరుకుంటుండగానే అదే మార్గంలో అతి వేగంగా వస్తున్న డీసీఎం రోడ్డు పక్కన ఉన్న ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న రైతు సోమ్లానాయక్ అక్కడికక్కడే మృతిచెందగా డ్రైవర్ బాగోతు దీపక్‌కుమార్(30)కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న పోలీసులు దీపక్‌కుమార్‌ను సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు సోమ్లానాయక్ కుమారుడు రామ్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని కేతేపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

కేంద్ర మంత్రి వాహనం తనిఖీ

తిరుమలగిరి: మండల పరిధిలోని ఈదులపర్రె తండా సమీపంలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద శనివారం కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ వాహనాన్ని ఎన్నికల ప్రత్యేక తనిఖీ బృందాలు తనిఖీ చేశాయి. కేంద్ర మంత్రి ఎన్నికల ప్రచారం కోసం హైదరాబాద్ నుంచి తుంగతుర్తి నియోజకవర్గానికి వెళ్తుండగా ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో బి. పిచ్చయ్య, డిప్యూటీ తహసీల్దార్ జాన్ మహ్మద్, దార శ్రీనివాస్ పాల్గొన్నారు.

మూడు ఇళ్లలో చోరీ

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : గుర్తుతెలియని వ్యక్తులు మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఆత్మకూర్ (ఎస్) మండల పరిధిలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన పొట్ట పెంజరభద్రమ్మ కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండగానే దుండగులు చొరబడి తులన్నర బంగారం, 40 తులాల వెండి చోరీ చేశారు. ఇదే తరహాలో గ్రామానికి చెందిన దువ్వ రవి ఇంట్లో మూడు బంగారు ఉంగరాలు, 15 తులాల వెండి, ఎర్రబోయిన అంజయ్య 30తులాల వెండి, చెవిదిద్దులు దొంగలు అపహరించుకుపోయారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం రావాలి


తిరుమలగిరిలో తనకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి సామేల్

తిరుమలగిరి : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామని, ఇందిరమ్మ రాజ్యం రావాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మందుల సామేల్ కోరారు. శనివారం తొండ, అనంతారం, నందాపురం, తాటిపాముల, ఈదులపర్రెతండా, నెల్లిబండతండా, తిరుమలగిరి తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలు పేదలకు వరం లాంటివన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వై.నరేష్, పట్టణ అధ్యక్షుడు పేరాల వీరేష్, కౌన్సిలర్ జితేందర్, సర్పంచ్‌లు శాతవాహన రావు, కృష్ణారెడ్డి, జనార్దన్, తిరుమని యాదగిరి, కొండల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, బత్తుల శ్రీను, లక్ష్మయ్య, రాము గౌడ్, సోమేష్, సలీం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు అమలు

అర్వపల్లి : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను వెంటనే అమలు చేస్తుందని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నెపర్తి జ్ఞానసుందర్ అన్నారు. శనివారం అర్వపల్లిలో తుంగతుర్తి కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేల్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల రమేష్, మేకల రాంబాబు, బైరబోయిన సైదులు, మహారాజు, సంపత్, కోటి ప్రసాద్ పాల్గొన్నారు.


అర్వపల్లిలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న అన్నెపర్తి జ్ఞానసుందర్